క్లుప్తంగా

సమాజంలో చెడు వ్యక్తులుగా మెలగవద్దు


నవదిన వేడుకలలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ జాన్‌పీటర్, తదితరులు

ఒంగోలు మెట్రో: స్థానిక సెయింట్ థెరిసా చర్చిలో జరుగుతున్న నవదిన వేడుకలలో ఆదివారం ముఖ్య అతిథిగా ఫాదర్ జాన్ పీటర్ పాల్గొని మాట్లాడారు. పరుల సొమ్ము ఆశింపకు అనే అంశంపై మాట్లాడుతూ.. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఎప్పుడైనా శాశ్వతమని, పరుల సొమ్ము పాము వంటిదని అన్నారు. అటువంటి సొమ్మును ఆశించి సమాజంలో చెడు వ్యక్తులుగా చెడ్డ పేరు తెచ్చుకోవడం వలన కుటుంబ పరువు పోవడంతో పాటు వ్యక్తిగతంగా చిన్నాభిన్నమవుతారని అన్నారు. అటువంటి ఆలోచనలకు తావు లేకుండా దేవుని పట్ల ప్రేమ, భయభక్తులతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ డీఎస్ పాల్ అసిస్టెంట్ ఫాదర్ హృదయరాజు, పునీత చిన్న థెరేసమ్మ సంఘ పెద్ద బొంతు ఆనందరావు, యువతీ యువకులు పాల్గొన్నారు

రేపటి నుంచి శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడించారు. మంగళవారం ఉదయం శ్రీవారికి తులసీదళాలతో అర్చన, తోమాల సేవ జరుగుతాయన్నారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీవారికి హనుమంత వాహనసేవ నిర్వహిస్తారన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడుర మొవ్వ వృషాద్రిపతి శ్రీవారి వైభవంపై ప్రసంగిస్తారన్నారు. అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 7 గంటలకు శ్రీవారికి ఊంజల్ సేవ, శ్రీగిరి దేవస్థానం సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్‌కుమార్‌చే గాత్రకచేరి జరుగుతాయన్నారు. అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం శ్రీవారికి తిరువీధి ఉత్సవం, శ్రీనివాస మహిళా కోలాట భజన సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరుగుతాయన్నారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

యర్రగొండపాలెం: స్థానిక తిరుమలగిరి కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో జూదం ఆడుతున్న ఇంటిపై దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.1,580 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

డిజిటల్ యాప్‌తో కూటమికి గుణపాఠం

● మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు:

ప్రజాస్వామ్యయుతంగా గెలవలేని కూటమి ప్రభుత్వం అడ్డదారుల్లో పదవులు చేజిక్కించుకుని అధికార మదంతో అరాచకాలకు పాల్పడుతోందని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేయగా, అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున మాట్లాడుతున్న కార్యకర్తలను, సోషల్ మీడియా వారిని పోలీస్ శాఖ ద్వారా ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తోందని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్ట్ చేయడం


వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

దుర్మార్గమని అన్నారు. కోర్టులు పలుమార్లు మొట్టికాయలు వేసినప్పటికీ కూటమి ప్రభుత్వ పాలకులకు సిగ్గు రావడంలేదంటూ విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారిని కూటమి ప్రభుత్వంలోని ఏ నాయకుడైనా ఇబ్బందులకు గురిచేసినా, అధికారులు, పోలీసులు వేధించినా అటువంటి వారిపై రాబోయే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కచ్చితంగా తగిన చర్యలు ఉంటాయని అరుణ హెచ్చరించారు. అలాంటి వారి పేర్లు నమోదు చేసేందుకు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. అనంతరం డిజిటల్ బుక్ యాప్‌ను పార్టీ నాయకులతో కలిసి అరుణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మద్దిపాడు ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు బెజవాడ రాము, పల్లపాటి అన్వేష్, దుడ్డు వినోద్ కుమార్, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, బొమ్మల రామాంజనేయులు, మోరబోయిన సంజీవరావు, సన్నపురెడ్డి రమణమ్మ, కాకర్లపూడి రజిని, మండవ బాలచందర్, నాదెండ్ల మహేష్, నారా సుబ్బారెడ్డి, గద్దె జాలయ్య, కావూరి ఏసేబు, పోకూరి శ్రీరామమూర్తి, అంబటి నరేంద్ర, మాల్యాద్రి పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం


సమావేశంలో పాల్గొన్న మానవతా సేవా సంస్థ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: మరణించిన నిరుపేద కుటుంబాలకు మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేయాలని, ఉచితంగా మార్చురీ బాక్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మానవతా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు తెలిపారు. ఆదివారం నగరంలోని కర్నూలు రోడ్డులో వర్మ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాలులో సేవా సంస్థ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నగరంలోని మూడు హిందూ శ్మశాన వాటికలను ఆధునికీకరించాలని నగర పాలక సంస్థకు విజ్ఞప్తి చేశారు. కుటుంబంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేయడానికి కూడా స్తోమత లేక అనేక మంది నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కుటుంబాలకు అంతిమ వాహనంతో పాటు మట్టి ఖర్చులకు సాయం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ 5వ తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా భావం కలిగిన పలువురు ఉపాధ్యాయులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు అందజేయాలని సేవా సంస్థ నిర్ణయించినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బోగిరెడ్డి, మంగళగిరి నరసింహరావు, కోసూరి శ్రీదేవి, కనకదుర్గ, నాగలక్ష్మి, చెరుకూరి ఆదిలక్ష్మి, వడ్డేంపూడి సుజాతరావు, శరభాలింగాచారి, బుజ్జి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యా కోర్సులతో నైపుణ్యాభివృద్ధి


సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులను రిపేర్ చేయడం నేర్చుకుంటున్న విద్యార్థులు


కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, ఆటోమేటివ్ ట్రేడ్‌లలో భాగంగా పది రోజులపాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో వివిధ వృత్తి విద్యా సంస్థలలో పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్స్ రిపేర్ షాపులలో, సెల్ షాపులలో, ఇంటర్నెట్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరింగ్, సర్వీసింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకాశం జిల్లా జీసీడీవో కె.హేమలత, జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ కిషోర్ కుమార్ సందర్శించి విద్యార్థులతో చర్చించారు. వారు నేర్చుకున్న అంశాలు, సెంటర్లలో చేసే పనులపై సమగ్ర అవగాహన పొందినందుకు విద్యార్థులను అభినందించారు. ఒకేషనల్ ట్రైనర్లు తంబి కుమారి, నిఖిల్ పర్యవేక్షించగా, తమకు ఈ అవకాశం కల్పించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈతముక్కల హెచ్ఎం సీహెచ్ చెంచు పున్నయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలి


రక్తదానం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి సాధన కోసం యువత పోరాటాలు చేపట్టాలని ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా స్థానిక గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత విశేషాలను వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల ప్రాయంలోనే ఉరికొయ్యను ముద్దాడిన వీరుడిగా కొనియాడారు. నేటి తరం యువకులు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని పోరాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను మరిచిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా హామీలను సాధించడంలో విఫలం చెందిందని విమర్శించారు. వెనకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని, పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత బేతూన్ నర్సింగ్ హోం వైద్యులు టి.పురుషోత్తం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకాలంలో రక్తం దొరక్క అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకోవడానికి డీవైఎఫ్ఐ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం మంచి పరిణామమని చెప్పారు. షేక్ అమీర్, టి.సురేష్, వై.రవికుమార్, సాల్మన్, మోహన్, పి.శ్రీనివాసరావు, అంకరాజు, నాగేశ్వరరావు, శ్రీకాంత్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో పి.కిరణ్, షేక్ జానీబాషా, టి.మహేష్, చీకటి శ్రీనివాసరావు, ఎస్టీ హుసేన్, ఏడుకొండలు, భావన, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు జేజేలు


మర్రిచెట్లకాలనీలోని దుర్గమ్మ మండపంలో గాజుల అలంకరణలో కనకదుర్గమ్మ


అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: దేవీశరన్నవరాత్రులను అన్ని ఆలయాలలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఒంగోలు నగరంలోని దుర్గమ్మ మండపాలలో అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. సాయంత్రం భవానీ దీక్షాపరులు దుర్గమ్మ సన్నిధిలో భజనలు, కీర్తనలతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని పలు ఆలయాలలో అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ఎరుపు రంగు పూలతో అలంకరించిన మహాచండీదేవిని దర్శనం చేసుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు, పసుపు, కుంకుమ సారె సమర్పించారు. కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం శివాలయంలో రాజరాజేశ్వరస్వామి వారాహిదేవిగా దర్శనమిచ్చారు. ఒంగోలు మర్రిచెట్లకాలనీలోని దుర్గమ్మ మండపంలో కనకదుర్గమ్మకు 200 డజన్ల గాజులతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మ అనుగ్రహం, ఆశీస్సులు అందుకున్నారు.

శక్తిపీఠాల ఆరాధన, పూజలతో మోక్షం...

దేవీశరన్నవరాత్రులలో శక్తిపీఠాల ఆరాధన మోక్షానికి మార్గమని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. మంత్రిప్రగడ నరసింహారావు స్మృత్యర్థం కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన త్రయాహ్నిక ఉపన్యాస యజ్ఞంలో మొదటి రోజు అష్టాదశ శక్తి పీఠాలపై ప్రసంగించారు. దేవస్థానం ఈవో రావెళ్ల శివశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మంత్రిప్రగడ ప్రసాద్, ప్రకాశం జిల్లా రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అన్నమయ్య సంగీత సేవా సమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య, ఓ.ప్రసాద్, మువ్వా నాగేశ్వరరావు, ఆకుల శ్రీను, సిరిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కేశవస్వామిపేటలోని లలితా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం ప్రముఖ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి అగస్త్యరాజు శివ దుర్గా వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దసరా నవరాత్రులలో దుర్గా ఆరాధనలోని సామాజిక, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు, దుర్గా నామ, రూప తత్వం, నవదుర్గ అవతార విశేషాల వివరణ అంశాల గురించి వివరించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకురాలు విజ్ఞానంద సరస్వతి మాతాజీ చేతుల మీదుగా శివను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చింతలపూడి అప్పారావు, మైనంపాటి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనిగంటలు పెంచిన

జీవోను రద్దు చేయాలి


● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు


మాట్లాడుతున కాలం సుబ్బారావు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కూటమి ప్రభుత్వం 8 గంటల కార్మికుల పనిని 10 గంటలకు పెంచుతూ చేసిన చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట పరిధిలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద సీఐటీయూ సంతనూతలపాడు మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 8 గంటల పనిదినాన్ని రద్దు చేయడానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. మన రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం 1948 పరిశ్రమల చట్టాన్ని సవరించి 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచుతూ అసెంబ్లీ తీర్మానించడం కార్మికులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. మహిళలకు పని ప్రదేశాల బయట ఇప్పటికే భద్రత లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. మహిళలు నైట్ డ్యూటీ చేయాలని చట్టాన్ని చేయడాన్ని మహిళలకు భద్రత లేకుండా చేయడమేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే మహిళలకు నైట్ డ్యూటీని రద్దు చేయాలని, మార్చిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, మండల నాయకులు దాసరి చిన్నబాబు, తుళ్లూరు సుబ్బారావు, జె.వీరనారాయణ, పి.చిన్న శేషయ్య, ఎల్.తిరుపతయ్య, ఏవీ సుబ్బారావు, కే రామకృష్ణారెడ్డి, ఏ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు పేరుతో దోపిడీకి తెరలేపుతున్న పాలకులు

● పాత మార్కెట్ స్థలాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని తీర్మానం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని పాత మార్కెట్ భూమిని పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ పాలకవర్గం దోపిడీకి తెరలేపుతోందని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ధ్వజమెత్తారు. నగరం నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో షాపింగ్‌మాల్ నిర్మించేందుకు నగర పాలకవర్గం చేస్తున్న ప్రయత్నాలపై ఆదివారం సుందరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర పాలక సంస్థకు ఏడాదికి రూ.172 కోట్ల ఆదాయం ఉన్నా ప్రజా ఆస్తులను రక్షించలేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మూడు లక్షల జనాభా పెట్టుకున్న నమ్మకాన్ని తుంగలోకి తొక్కుతూ పాత మార్కెట్‌లో కాంప్లెక్స్ నిర్మాణాన్ని పీపీపీకి అప్పగించాలని ప్రయత్నాలు చేస్తున్నారని, పాలకుల వైఫల్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. పాత మార్కెట్ స్థలంలో జీప్లస్4 కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రైవేటు బిడ్‌లు ఆహ్వానించడం ప్రజా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. దోపిడీ శక్తులకు పాలకులు లొంగిపోయారని ఎద్దేవా చేశారు. సీపీఐ నాయకుడు కొత్తకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలనను గాలికి వదిలేసిన పాలకులు ప్రభుత్వ భూములపై పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత మార్కెట్ స్థలాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు కొంగర నరసింహం, ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు దాసరి సుందరం, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఏవీ పుల్లారావు, నగర కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, శేషయ్య పాల్గొన్నారు.

జాషువా కలలను సాకారం చేద్దాం


చీమకుర్తి బస్టాండ్‌లో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య

ఒంగోలు టౌన్: మహాకవి గుర్రం జాషువా కలలను సాకారం చేసేందుకు కృషి చేద్దామని, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రఘురాం పిలుపునిచ్చారు. ఆదివారం గుర్రం జాషువా కాలనీలో కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో జాషువా 130వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ సమాజ మార్పు కోసం జాషువా సాహిత్యాన్ని సృజించారని చెప్పారు. ఆయన గబ్బిలం రచన దేశవ్యాప్తంగా పేరొందడమే కాకుండా ప్రజలలో ఆలోచన రేకెత్తించిందని చెప్పారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటానికి ప్రేరణగా నిలిచిందని చెప్పారు. సమానత్వ సమాజాన్ని నిర్మించడమే జాషువాకు నిజమైన నివాళి అని అన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీటర్, సుబ్బారెడ్డి, ప్రేమలత, అంజమ్మ, బుజ్జి, కోటేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా..

ఒంగోలు వన్‌టౌన్: గుర్రం జాషువా నవయుగ కవి చక్రవర్తి అని బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ బొట్ల సుబ్బారావు అన్నారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓపీడీఆర్ నాయకులు చావలి సుధాకర్, బీసీ నాయకులు గుంటూరు మస్తాన్, టి.వెంకటస్వామి, ఆనంద్ మాదిగ, చుండూరి రంగారావు తదితరులు పాల్గొని జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు.

మాల జేఏసీ కార్యాలయంలో...

గుర్రం జాషువా జయంతిని ఒంగోలులోని మాల జేఏసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాల జేఏసీ అధ్యక్షుడు కె.ఏడుకొండలు, విశ్రాంత డీఈవో మధుసూదనరావు, రాంబాబు, రవి, శాంతారావు తదితరులు పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా గ్రంథాలయం ఆవరణలో...

ఒంగోలు మెట్రో: స్థానిక జిల్లా గ్రంథాలయం ఆవరణలో నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి, కవికోకిల గుర్రం జాషువా 130వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు నిర్వహణలో కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ పాల్గొని జాషువా సేవలను కొనియాడారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, జిల్లా గ్రంథాలయ ఇన్చార్జి ఉప గ్రంథపాలకురాలు సంపూర్ణ, కాళహస్తి, అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి, పిన్ని వెంకటేశ్వర్లు, పి.భాస్కర్, యు.వి.రత్నం, వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, మెడబలిమి సాంబశివరావు, పాలేటి బాబూరావు, మిట్నసల శాంతారావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, కె.ప్రేమకుమార్, వాకా సంజీవరెడ్డి, దార్ల నారాయణ, బీరం అరుణ, ఓరుగంటి ప్రసాద్, టి.కృష్ణారెడ్డి, చెన్నయ్య, అంబటి కొండయ్య, మొగిలిదేవ ప్రసాద్, కందుల మధు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన హార్మోనిస్ట్ షేక్ సుభానికి నివాళి అర్పించారు.


జిల్లా గ్రంథాలయంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళామిత్రమండలి సభ్యులు

చీమకుర్తిలో...

చీమకుర్తి: గుర్రం జాషువా జయంతి వేడుకలను ఆదివారం చీమకుర్తిలోని బూచేపల్లి బస్టాండ్‌లో వైఎస్ భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్.మాణిక్యం, కౌన్సిలర్ ఖాజామొహిద్దీన్, పిన్నిక శ్రీనివాసరావు, పాటిబండ్ల బాబూరావు, రవి, శ్రీకాంత్, దాస్ పాల్గొన్నారు.


చీమకుర్తిలో జేఏసీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జేఏసీ ఆధ్వర్యంలో...

అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని వృద్ధాశ్రమంలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా చేసిన సేవలను కొనియాడారు. జేఏసీ అధ్యక్ష కార్యదర్శులు బండ్ల కొండలు, అత్యాల దావీదు, తెల్లమేకల గాంధీ, పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు


ఒంగోలులో మాట్లాడుతున్న బీసీ నాయకుడు బొట్ల సుబ్బారావు